విలేకరులు కావలెను

పవర్ జాతీయ తెలుగు దినపత్రికలో పనిచేయుటకు విలేకరులు కావలెను.

ఆసక్తి కలవారు, అనుభవం కలవారుసంప్రదించగలరు.

జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారీగా ఆర్‌సీ ఇంచార్జీలు, మండలాలవారీగా విలేకరులు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యత, కొత్తవారికి అవకాశం ఉంటుంది

ఇంచార్జ్ : పొన్నం మహేష్‌గౌడ్

90004 88885



Dr.PRK

# పవర్

పోరాడితే పోయెదేమీ లేదు బానిస సంకెళ్ళు తప్ప



రామకృష్ణ హాస్పిటల్స్

పక్షవాతం, డిస్క్ సమస్యలు,
నడుమునొప్పి
మెడ నొప్పులకు
పూర్తి చికిత్స కలదు.
నిరుపేదలకు ఉచిత వైద్యం



రామకృష్ణ చారిటబుల్ ట్రస్ట్

విజయ టాకీస్ దగ్గర, హనుమాన్ టెంపుల్ లైన్, హనుమకొండ
సెల్: 9849485100



సంపుటి : 01 సంచిక : 314 | బుధవారం 12 ఆగస్టు 2026 | పేజీలు : 4 | వెల : 4


# 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'

## తెలంగాణకు భారీగా పెట్టుబడులే లక్ష్యం : సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, పవర్ న్యూస్

రాష్ట్రానికి విదేశీ, స్వదేశీ పెట్టుబడులను మరింతగా ఆకర్షించడమే లక్ష్యంగా డిసెంబర్ నెలలో నిర్వహించతలపెట్టిన 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'కు సన్నాహాలు ముమ్మరం చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సమ్మిట్ సన్నద్ధత, ముందస్తు ఏర్పాట్లపై ఆయన ఉన్నతాధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించి పలు కీలక సూచనలు చేశారు. ఈ సదస్సును అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అత్యంత ఘనంగా నిర్వహించాలని సీఎం ఆదేశించారు. వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో విశేష సేవలు అందించి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ప్రముఖులను ఈ గ్లోబల్ సమ్మిట్ వేదికగా ఘనంగా సన్మానించేందుకు వీలుగా ప్రత్యేక కార్యాచరణను రూపొందించాలని అధికారులకు సూచించారు. గత సదస్సు ద్వారా రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడుల వివరాలతో పాటు, ఆయా ప్రాజెక్టుల ప్రస్తుత పురోగతిపై సమగ్ర నివేదికను సమర్పించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో రాష్ట్రానికి మరింతగా పెట్టుబడులను రాబట్టేందుకు అనుసరించాల్సిన వ్యూహాలు, అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావులతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సంగారెడ్డి జిల్లాలో ఘోర ప్రమాదాలు

## తొమ్మిది మంది దుర్మరణం



సంగారెడ్డి, ఆగస్టు 11

సంగారెడ్డి జిల్లాలో చోటుచేసుకున్న రెండు వేర్వేరు ఘోర రోడ్డు ప్రమాదాలు తీవ్ర విషాదాన్ని నింపాయి. ఈ ప్రమాదాల్లో మొత్తం తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. తొలి ఘటన జహీరాబాద్ మండలం సత్వార్ సమీపంలో జరిగింది. వేగంగా వచ్చిన ఒక ట్యాంకర్, ప్రయాణికులతో వెళ్తున్న ఆటోను బలంగా ఢీకొట్టింది. ఈ భయానక ప్రమాదంలో ఏడుగురు అక్కడికక్కడే దుర్మరణం చెందగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులంతా కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లా రాజగిరికి చెందిన వ్యవసాయ కూలీలుగా పోలీసులు గుర్తించారు. ప్రమాద వార్త తెలిసిన వెంటనే క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జహీరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.మరో ఘటన కోహీర్ మండలం వెంకటాపూర్ కూడలి సమీపంలో 65వ నంబరు జాతీయ రహదారిపై ఎదురైంది. వేగంగా వెళ్తున్న ఒక కారు అదుపుతప్పి, రోడ్డు డివైడర్‌పై నుంచి అవతలి వైపునకు ఎగిరిపడింది. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా, రహదారిపై వెళ్తున్న మరో నాలుగు వాహనాలు తీవ్రంగా ధ్వంసమయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాలకు చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

## పాతబస్తీ మెట్రో విస్తరణ



హైదరాబాద్, పవర్ న్యూస్

హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణలో భాగంగా పాతబస్తీ మెట్రో రైలు పనులను యుద్ధ ప్రాతిపదికన వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ పురోగతిపై నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో సీఎం పాల్గొని, ప్రాజెక్టు విస్తరణపై పలు కీలక ఆదేశాలిచ్చారు. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు చేపడుతున్న 7.5 కిలోమీటర్ల మెట్రో కారిడార్ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ మార్గానికి సంబంధించిన టెండర్ ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని, దానికి అవసరమైన భూ సేకరణ పనుల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. నగరంలో పెరుగుతున్న ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ప్రస్తుతం నడుస్తున్న మెట్రో రైళ్లకు అదనపు కోచ్‌లను జత చేయాలని, అందుకోసం అవసరమైన కొత్త కోచ్‌ల కొనుగోలు ప్రక్రియను త్వరితగతిన వేగవంతం చేయాలని అధికారులను కోరారు. ఎంజీబీఎస్‌చాంద్రాయణగుట్ట కారిడార్‌లో అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించేందుకు ఢిల్లీ మెట్రో నిపుణులను సంప్రదించి, వారి సలహాలు తీసుకోవాలని హెచ్‌ఎంఆర్‌ఎల్ యాజమాన్యానికి సూచించారు. ఈ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ప్రభుత్వ సలహాదారులు రామకృష్ణారావు, ఎన్వీఎస్ రెడ్డి, మెట్రో రైల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, అదనపు ఎండీ అజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఆందోళనలపై

## హోంమంత్రి వివరణ ఇవ్వాలి



న్యూఢిల్లీ, ఆగస్టు 11

విద్యార్థుల నిరసనలు, వారిపై పోలీసుల చర్యల వ్యవహారంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో స్పష్టమైన వివరణ ఇవ్వాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం కూడా ఆయన లోక్‌సభకు హాజరు కాకపోవడంపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించింది. ఇతరులను బెదిరించేవారే అసలైన పిరికివారని ఆయన ప్రవర్తన మరోసారి రుజువు చేసిందంటూ కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా విరుచుకుపడ్డారు. వాస్తవాలను పక్కనపెట్టేందుకు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలించలేదని, అయినప్పటికీ కేంద్ర హోం మంత్రి లోక్‌సభకు హాజరు కాకపోవడం దారుణమని జైరాం రమేశ్ పేర్కొన్నారు. గడిచిన 17 రోజులుగా ఆయన లోక్‌సభతో పాటు రాజ్యసభకు కూడా గైర్హాజరు కావడం అనూహ్యంగా ఉందన్నారు. "అమిత్ షా క్షేమంగానే ఉన్నారా? అసలు ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా (#1, #2)ల మధ్య అంతా సవ్యంగానే ఉందా?" అంటూ ఆయన పరోక్షంగా ప్రశ్నలు సంధించారు.మరోవైపు, విద్యార్థుల ఆందోళనలు, పోలీసుల చర్యల అంశంపై లోక్‌సభలో సమగ్ర చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఇప్పటికే స్పష్టం చేశారు. సభలో జరిగే సదరు చర్చకు హోంమంత్రినే స్వయంగా సమాధానం ఇస్తారని ఆయన వెల్లడించారు. ఇదిలా ఉండగా, ఇప్పటివరకు 17 రోజుల పాటు సాగిన లోక్‌సభ సమావేశాల్లో ప్రభుత్వం మొత్తం 11 బిల్లులను ఆమోదింపజేసుకుంది. అయితే వీటిలో కేవలం రెండింటిపై మాత్రమే సభలో చర్చ జరగగా, ప్రతిపక్షాల తీవ్ర ఆందోళనల నడుమ మిగిలిన బిల్లులన్నీ ఎలాంటి చర్చ లేకుండానే ఆమోదం పొందడం గమనార్హం.

## బీజేపీ నిరాశకు నిదర్శనమంటూ 'హస్తం' ధ్వజం



న్యూఢిల్లీ, పవర్ న్యూస్

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హాలిడే ఫొటోపై కేంద్ర మంత్రి, భాజపా నేత గిరిరాజ్ సింగ్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర రాజకీయ కలకలానికి దారితీశాయి. గిరిరాజ్ సింగ్ పోస్ట్‌ను కాంగ్రెస్ పార్టీ తీవ్రస్థాయిలో ఖండించింది. ఇటీవల సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న ఆ ఫొటోలో రాహుల్ గాంధీ ఒక బోట్‌లో కూర్చొని ఉండగా, ఆయన పక్కన ఒక మహిళ, బాలుడు కనిపిస్తున్నారు. ఈ చిత్రాన్ని తన 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతాలో పంచుకున్న కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్.. "రాహుల్‌జీ, ఈ ఫొటో ఎప్పుడు, ఎక్కడ తీసుకున్నారు? మీతో ఉన్న ఆ వ్యక్తులు ఎవరు? వారెవరో తెలుసుకోవాలని ఆసక్తిగా ఉంది" అని వ్యాఖ్యానించారు. కేంద్ర మంత్రి వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు తీవ్రంగా స్పందించారు. ఆ ఫొటో అమెరికాలోని టెక్సాస్‌లో రాహుల్ గాంధీ తన మిత్రుడి కుటుంబ సభ్యులతో గడిపిన సమయానికి సంబంధించినదని స్పష్టం చేశారు. "మీలో దాగి ఉన్న నిరాశా నిస్పృహలే ఇలాంటి దిగజారుడు స్పందనలకు కారణమవుతున్నాయి. నిజా నిజాలు తెలుసుకోకుండా వ్యక్తిగత ఫొటోలపై ఇలాంటి ఆలోచనలు చేయడం ఏమాత్రం తగదు" అని కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. రాహుల్ గాంధీ రాజకీయ కార్యకలాపాల నుంచి విరామం తీసుకుని వెళ్లే విదేశీ పర్యటనలపై భాజపా నాయకులు తరచూ విమర్శలు గుప్పిస్తూనే ఉంటారు. కొన్ని రోజుల క్రితం కూడా భాజపా ఐటీ సెల్ ఇన్చార్జ్ అమిత్ మాలవీయ స్పందిస్తూ.. జూన్ 22 నుంచి జులై 13 మధ్య రాహుల్ విదేశీ పర్యటన రహస్యంగా సాగిందని, ఆయన ఎక్కడికి వెళ్లారో, ఎవరిని కలిశారో, ఆ ప్రయాణ ఖర్చులను ఎవరు భరించారో చెప్పాలంటూ 'ఎక్స్' వేదికగా ప్రశ్నించిన సంగతి తెలిసిందే.

## అందుకే రేవంత్ రెడ్డి వద్దకు వెళ్లి కండువా కప్పుకున్నా: పోచారం

## శ్రీనివాస్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్య

### పెండింగ్ బిల్లులకు ప్రభుత్వం సగం నిధులే ఇచ్చిందని అసంతృప్తి

### అన్నం పెట్టిన వారిని ఎప్పటికీ మర్చిపోలేనని వ్యాఖ్య

### ప్రస్తుతం ముఖ్యమంత్రి, మంత్రులు ఫోన్లు ఎత్తడం లేదని ఆరోపణ



హైదరాబాద్, పవర్ న్యూస్

తన నియోజకవర్గ అభివృద్ధి కోసమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరానని, పదవుల కోసమో, డబ్బు కోసమో కాదని బాన్సువాడ ఎమ్మెల్యే, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. పెండింగ్ బిల్లులకు సంబంధించి ప్రభుత్వం సగం నిధులే విడుదల చేయడంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మంగళవారం బిర్కూర్‌లో పార్టీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. పెండింగ్ బిల్లుల చెల్లింపులో జాప్యం కారణంగా కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారని పోచారం తెలిపారు. గత నవంబర్‌లో పార్టీ మారిన ఎమ్మెల్యేలతో జరిగిన సమావేశంలో ఇదే విషయాన్ని తాను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లానని గుర్తుచేశారు. ఆరు నెలల్లోగా బిల్లులు మంజూరు చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినప్పటికీ, ప్రస్తుతం సగం నిధులే విడుదలయ్యాయని పేర్కొన్నారు. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మిగతా మొత్తాన్ని మంజూరు చేయలేదని ఆయన ఆరోపించారు.

## కేటీఆర్ ఆరోపణలు అసత్యం



హైదరాబాద్, పవర్ న్యూస్

టెసరాట్ సంస్థకు భూ కేటాయింపుల వ్యవహారంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేస్తున్న ఆరోపణలన్నీ పూర్తి అవాస్తవాలని, అందులో ఎలాంటి నిజం లేదని పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడిన ఆయన.. కేటీఆర్ ఉద్దేశపూర్వకంగానే అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆక్షేపించారు.గత బీఆర్ఎస్ పాలనలో ఎకరం రూ.90 లక్షలకు కేటాయిస్తే, తమ ప్రభుత్వం బోర్డు నిర్ణయించిన ధరకు అనుగుణంగా ఎకరం రూ.కోటిన్నరకు ఇచ్చిందని శ్రీధర్‌బాబు వివరించారు. సదరు భూముల కోసం దరఖాస్తు చేసుకున్న 32 సంస్థల్లో టెసరాట్ ఒకటని, కేటాయింపులన్నీ నియమనిబంధనల ప్రకారమే జరిగాయని చెప్పారు. ఈ కంపెనీతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరులకు ఎలాంటి సంబంధమూ లేదని తేల్చి చెప్పారు. ఐదు ఎకరాల్లో రూ.34 కోట్ల పెట్టుబడితో ఏర్పాటయ్యే సంస్థను రూ.200 కోట్ల విలువైనదిగా చూపిస్తూ, కేవలం సోషల్ మీడియా పోస్టుల ఆధారంగా కేటీఆర్ బాధ్యతారహితంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో తక్కువ ధరకు భూములు ఎందుకు కేటాయించారో, అందులో ఏవైనా ముడుపులు తీసుకున్నారేమో కేటీఆరే సమాధానం చెప్పాలని మంత్రి నిలదీశారు. రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు రాకూడదనే దురుద్దేశంతోనే కేటీఆర్ ఈ ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. పీఎం ఏక్తామాల్ టెండర్లు కూడా పూర్తి పారదర్శకంగా జరిగాయని స్పష్టం చేశారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం లీజు భూములను రెగ్యులరైజ్ చేసినప్పుడు కేటీఆర్‌కు తప్పుగా అనిపించలేదా అని ప్రశ్నించిన శ్రీధర్‌బాబు.. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం కలలో మాట అని ఎద్దేవా చేశారు.

## ఘనంగా 19వ జాతీయ ప్రజాసంబంధ విద్యా దినోత్సవం

- పిఆర్ పితామహుడికి మంత్రి వివేక్ నివాళులు



హైదరాబాద్, పవర్ న్యూస్

సి.వి.ఎన్. పిఆర్ ఫౌండేషన్, పీఆర్ఎస్ఐ హైదరాబాద్ చాప్టర్ సంయుక్త ఆధ్వర్యంలో 19వ జాతీయ ప్రజా సంబంధాల విద్యా దినోత్సవాన్ని హైదరాబాద్‌లోని ఎఫ్‌టిసిసిఐ వేదికగా ఘనంగా నిర్వహించారు. పిఆర్ రంగ పితామహుడు డాక్టర్ సి.వి. నరసింహారెడ్డి 93వ జయంతి సందర్భంగా "నమ్మకం, సత్యం, పారదర్శకత" అనే ఇతివృత్తంతో సాగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏఐ, డీప్‌ఫేక్‌లు సవాళ్లు విసురుతున్న ప్రస్తుత తరుణంలో పీఆర్ నిపుణులు నిజాయితీ, పారదర్శకతతో వ్యవహరిస్తూ వాస్తవ సమాచారాన్ని, ప్రభుత్వ సంక్షేమ ఫలాలను ప్రజలకు చేరవేయాలని మంత్రి పిలుపునిచ్చారు. పీఆర్ఎస్ఐ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ అజిత్ పాఠక్, సైబర్ సెక్యూరిటీ నిపుణులు డాక్టర్ శ్రీరామ్ బిరుదవోలు తదితరులు పాల్గొన్న ఈ వేడుకలో పిఆర్ రంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పలువురు నిపుణులు, అధ్యాపకులు, విద్యార్థులకు జాతీయ స్థాయి పురస్కారాలను అందజేశారు.

## తెలంగాణలో ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి..

### 73 లక్షల ఓట్లు పోయినట్టే

### తెలంగాణలో 3.38 కోట్ల మంది ఓటర్లు ఉన్నట్టు ప్రాథమిక అంచనా

### ఇప్పటి వరకు 2.64 కోట్ల ఎస్ఐఆర్ ఫామ్‌ల డిజిటలైజేషన్ పూర్తి

### జాడ తెలియని ఓటర్ల సంఖ్య 11.25 లక్షలు



హైదరాబాద్, పవర్ న్యూస్

తెలంగాణ వ్యాప్తంగా ఎంతో ఆసక్తి రేపిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ఎన్యూమరేషన్ ప్రక్రియ ముగిసింది. ఈ భారీ సవరణ ప్రక్రియలో భాగంగా రాష్ట్రంలో మొత్తం 3.38 కోట్ల మంది ఓటర్లు ఉన్నట్లు ఎన్నికల అధికారులు ప్రాథమికంగా లెక్క తేల్చారు. సేకరించిన సమాచారంలో ఇప్పటి వరకు దాదాపు 2.64 కోట్ల ఫారాలను డిజిటలైజేషన్ పూర్తి చేయగా, నమోదు ప్రక్రియ 78.30 శాతానికి చేరింది. అయితే ఈ నమోదు సరళిని గమనిస్తే రాబోయే రోజుల్లో రాష్ట్ర ఓటర్ల జాబితా స్వరూపమే మారిపోనుందని స్పష్టమవుతోంది. మరోవైపు, క్షేత్రస్థాయి పరిశీలనలో అధికారులకు సవాలుగా మారిన అనేక అంశాలు వెలుగుచూశాయి. మొత్తం 73.39 లక్షల ఎన్యూమరేషన్ ఫారాలను (21.70 శాతం) వివిధ కారణాల వల్ల సేకరించలేకపోయినట్లు అధికారులు 'అన్‌కలెక్టబుల్'గా వర్గీకరించారు. ఇందులో అత్యధికంగా 45.18 లక్షల మంది ఓటర్లు తమ నివాస ప్రాంతాల నుంచి శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినట్లు గుర్తించగా, 9.22 లక్షల మంది ఓటర్లు మరణించినట్లు నమోదైంది. మరో 11.25 లక్షల మంది అసలు జాడ తెలక అడ్రస్ దొరకని స్థితిలో ఉండగా, 6.70 లక్షల మందికిపైగా ఇప్పటికే వేర్వేరు ప్రాంతాల్లో ఓటర్లుగా నమోదై ఉన్నట్లు అధికారులు తేల్చారు. ఈ భారీ వ్యత్యాసాలు, వలసల గణాంకాల నేపథ్యంలో తుది ఓటర్ల జాబితా ప్రక్షాళనలో ఊహించని పెద్ద మార్పులు చోటుచేసుకోనున్నాయి.

# కాకతీయ జూలాజికల్ పార్క్ అభివృద్ధికి CAMPA నిధులు ఇవ్వాలి

- వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య
- కేంద్ర జూ అథారిటీ సభ్య కార్యదర్శి వి. క్లెమెంట్ బెన్‌కు వినతిపత్రం సమర్పణ
- ఎన్‌క్లోజర్లు, నైట్ షెల్టర్ల నిర్మాణానికి వెంటనే అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి
- జంతువుల భద్రత కోసం వీడియో, ఆడియో పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటుకు సూచన

**న్యూఢిల్లీ ఆగస్టు 11(పవర్):** హనుమకొండలోని కాకతీయ జూలాజికల్ పార్క్ అభివృద్ధికి కాంపెన్సేటరీ అఫారెస్టేషన్ ఫండ్ మేనేజ్‌మెంట్ అండ్ ప్లానింగ్ అథారిటీ (CAMPA) నిధులు మంజూరు చేయాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర జూ అథారిటీ సభ్య కార్యదర్శి డా. వి. క్లెమెంట్ బెన్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేసి చర్చించారు. సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కాకతీయ జూ పార్కులో సింహాలు, హైనా, జాకల్, వైల్డ్‌డాగ్, సరీసృపాల కోసం ఎన్‌క్లోజర్లు, నైట్ షెల్టర్ల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలను తెలంగాణ అటవీ శాఖ ఇప్పటికే కేంద్ర జూ అథారిటీకి పంపినట్లు ఎంపీ తెలిపారు. సాంకేతిక కమిటీ సూచనల మేరకు అవసరమైన సవరణలు చేసి డిజైన్లు, డ్రాయింగ్‌లు సమర్పించినందున వాటికి త్వరితగతిన ఆమోదం తెలపాలని కోరారు. ?మొక్కల పెంపకం, పచ్చదనం పెంపొందించడం, పార్కు విస్తరణకు కాంపా నిధులను విడుదల చేసి వినియోగించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జూలో ఉన్న జంతువుల ప్రవర్తన, ఆరోగ్యం, భద్రతను నిరంతరం గమనించేందుకు ఆధునిక వీడియో, ఆడియో రికార్డింగ్ సాంకేతిక వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ?కాకతీయ జూలాజికల్ పార్కును ఎకో టూరిజం, వన్యప్రాణి సంరక్షణ, పర్యావరణ విద్య కేంద్రంగా తీర్చిదిద్దితే వరంగల్ ప్రాంతానికి పర్యాటకుల రాక పెరిగి, స్థానికులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఎంపీ పేర్కొన్నారు. ఎంపీ కడియం కావ్య చేసిన విజ్ఞప్తులపై కేంద్ర జూ అథారిటీ సభ్య కార్యదర్శి డా. వి. క్లెమెంట్ బెన్ సానుకూలంగా స్పందించారు. సమర్పించిన ప్రతిపాదనలను నిబంధనల ప్రకారం పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



# పీహెచ్‌సీల్లో డీఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీలు

**జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలు సకాలంలో పూర్తి చేయాలి.. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి**







**వరంగల్, ఆగస్టు 11 (పవర్):** వరంగల్ జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవల పనితీరును మెరుగుపరిచేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. బి. రాజా రెడ్డి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ డా. ఐ. ప్రకాష్‌తో కలిసి దుగ్గొండి, నల్లబెల్లి, బానోజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, ఫార్మసీ సేవలను పరిశీలించారు. వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన రికార్డులు, రిజిస్టర్లు, కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. సిబ్బంది పనితీరు, అందుబాటులో ఉన్న మానవ వనరులు, ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులో మెరుగైన ఫలితాలు సాధించాలని డీఎంహెచ్ఓ వైద్యాధికారులు, సిబ్బందికి సూచించారు. నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని, రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు.

**సీజనల్ వ్యాధులపై అప్రమత్తత**

ప్రస్తుత సీజన్‌లో వచ్చే సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని డా. రాజా రెడ్డి సూచించారు. దోమల వృద్ధిని అరికట్టేందుకు 'డ్రై డే' కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వ్యాధుల నివారణపై అవగాహన కల్పించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అత్యవసర మందులను అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. మందుల నిల్వలు, వినియోగంపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని తెలిపారు.

**పరిశుభ్రతకు ప్రాధాన్యం**

ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, అందుబాటులో ఉన్న మానవ వనరులు, వైద్య సౌకర్యాలను సమర్థవంతంగా వినియోగించుకుని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని డీఎంహెచ్ఓ సూచించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులో నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, విధుల్లో సమయపాలన పాటించాలని డా. బి. రాజా రెడ్డి స్పష్టం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సేవలను మరింత బలోపేతం చేయాలని సూచించారు.

# మాసశివరాత్రి వేళ ఐనవోలు మల్లికార్జునుడికి విశేష పూజలు

**వైభవంగా పెద్దపట్నం.. రుద్ర హోమం, రుద్రాభిషేకం, శివకళ్యాణం నిర్వహణ**







**ఐనవోలు, ఆగస్టు 11(పవర్):** మాసశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానంలో మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఒగ్గు పూజారులచే సంప్రదాయబద్ధంగా పెద్దపట్నం కార్యక్రమాన్ని నిర్వహించగా, దేవాలయ అర్చకుల ఆధ్వర్యంలో శ్రీ స్వామివారికి రుద్ర హోమం, రుద్రాభిషేకం, శివకళ్యాణ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. మాసశివరాత్రి సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో భక్తులు పాల్గొని శ్రీ మల్లికార్జున స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఉప ప్రధానార్చకులు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకులు ఐనవోలు మధుకర్ శర్మ, వేదపండితులు గట్టు పురుషోత్తం శర్మ, విక్రాంత్ వినాయక్ జోషి, అర్చకులు నందనం భాను ప్రసాద్ శర్మ, నందనం మధు, ఉప్పుల శ్రీనివాస్, పాతర్లపాటి నరేష్ శర్మ, మడికొండ దేవేందర్, సాయి వరుణ్, ఒగ్గు పూజారులు మజ్జిగ అశోక్, ఐలయ్యతో పాటు దేవాలయ సిబ్బంది, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు. మాసశివరాత్రి సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తులను ఆధ్యాత్మికానందంలో ముంచెత్తాయని దేవాలయ కార్యనిర్వహణాధికారి కందుల సుధాకర్ తెలిపారు.

# స్తంభంపల్లిలో చీరల పంపిణీ

**వరంగల్, ఆగస్టు 11(పవర్ దినపత్రిక )** గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ 17వ డివిజన్ స్తంభంపల్లి లో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశానుసారం 17వ డివిజన్ అధ్యక్షులు పసునూరి శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామ పార్టీ అధ్యక్షులు కలకోట్ల రాజు అధ్యక్షతన మంగళవారం గ్రామంలోని మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో డివిజన్ సమన్వయ కమిటీ మెంబర్ ఎల్లపురం భరత్, గ్రామ పార్టీ నాయకులు పోచన స్వామి, సాందేసారి కిషన్ రావు, బేంబిరి మోహాన్ రావు, తోట శ్రీనివాస్ గార్లు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# ఆదివాసీలకు పౌష్టికాహారం.. రక్షిత మంచినీరు ఇవ్వాలి

**- కొమరం భీమ్ వర్ధంతి నాటికి కెరమెరి -- జోడేఘాట్ డబుల్ రోడ్డు పూర్తి చేయాలి**
**- అడ, ఎన్టీఆర్ సాగర్ ప్రాజెక్టుల కింద 60 వేల ఎకరాలకు పూర్తిస్థాయి సాగునీరు అందించాలి**
**- పోడు భూముల సమస్యను పరిష్కరించి హక్కుల పత్రాల భూములను అప్పగించాలి**
**- తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత**





హైదరాబాద్, ఆగస్టు 11 (పవర్): రాష్ట్రంలోని ఆదివాసీ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు పౌష్టికాహారం, రక్షిత తాగునీరు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఆదివాసీల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన సంస్థలు క్షేత్రస్థాయిలో మరింత సమర్థవంతంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.

కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన పలువురు ఆదివాసీ నాయకులు, తెలంగాణ ఆదివాసీ టైగర్ సేన నాయకులు మంగళవారం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో ఉన్న పార్టీ కార్యాలయంలో తెలంగాణ రక్షణ సేనలో చేరారు. ఈ సందర్భంగా కవిత వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

### జోడేఘాట్‌కు డబుల్ రోడ్డు

ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ ఆదివాసీల ఆరాధ్య దైవం కొమరం భీమ్ వర్ధంతి నాటికి కెరమెరి నుంచి జోడేఘాట్ వరకు డబుల్ రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. జోడేఘాట్‌కు వచ్చే ఆదివాసీ ప్రజలు, సందర్శకులకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు రహదారి నిర్మాణాన్ని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని కోరారు.

### 60 వేల ఎకరాలకు సాగునీరు

అడ ప్రాజెక్టు, ఎన్టీఆర్ సాగర్ ప్రాజెక్టుల కాల్వలను ఆధునీకరించి వాటి కింద ఉన్న మొత్తం 60 వేల ఎకరాల ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని కవిత డిమాండ్ చేశారు. ప్రాజెక్టులు ఉన్నప్పటికీ కాల్వల సామర్థ్యం, నిర్వహణ లోపాల కారణంగా ఆయకట్టుకు ఆశించిన స్థాయిలో నీరు అందడం లేదని ఆమె పేర్కొన్నారు.

### పోడు సమస్యకు శాశ్వత పరిష్కారం

ఆదివాసీలను ఏళ్లుగా వేధిస్తున్న పోడు భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కవిత కోరారు. గతంలో ప్రభుత్వం మంజూరు చేసిన హక్కుల పత్రాలకు సంబంధించిన భూములను వెంటనే ఆదివాసీలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్త సర్వే నిర్వహించి భూ సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

### నామ్‌కే వాస్తేగా ఐటీడీఏలు

ఆదివాసీలకు అండగా నిలిచేందుకు ఏర్పాటు చేసిన సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థలు (ఐటీడీఏలు) నామ్‌కే వాస్తేగా మారిపోవడం దురదృష్టకరమని కవిత విమర్శించారు. ఆదివాసీ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు, తాగునీరు, పోషకాహారం, విద్య, వైద్యం, సాగునీరు వంటి ప్రాథమిక అవసరాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. ఆదివాసీ నాయకుడు సోయం బోజారావు గుట్టబండపై మట్టి పోసి పంటలు సాగు చేయడం ఆ వర్గాల దుర్భర పరిస్థితులకు అద్దం పడుతోందని కవిత పేర్కొన్నారు. త్వరలోనే ఆదివాసీ ప్రాంతాల్లో పర్యటించి వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుంటామని, ఆదివాసీలకు ఎల్లవేళలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

### పలువురు ఆదివాసీ నాయకుల చేరిక

కార్యక్రమంలో కోట్నక కిషన్ రావ్, పెందోర్ ధర్ము, పెందోర్ దౌలత్ రావ్ తదితరులు తెలంగాణ రక్షణ సేనలో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి బోడ జనార్దన్, సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కావేటి సబిత తదితరులు పాల్గొన్నారు.

---

# నర్సుల శ్రమకు విలువ లేదా.. హక్కులకు రక్షణ లేదా?

**నర్సుల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి**
**ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలతో చర్చించి**
**స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలి: కల్వకుంట్ల కవిత**



హైదరాబాద్, ఆగస్టు 11(పవర్ ): ప్రైవేట్ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న నర్సులకు ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ప్రైవేట్ ఆస్పత్రులు ప్రజల నుంచి భారీ మొత్తాల్లో ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ, అక్కడ పనిచేస్తున్న నర్సులు, ఇతర సిబ్బందికి కనీస భద్రతా సౌకర్యాలు లేకపోవడం బాధాకరమన్నారు.

మంగళవారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో ప్రైవేట్ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న నర్సులు కల్వకుంట్ల కవితను కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా నర్సుల సమస్యలను అడిగి తెలుసుకున్న ఆమె.. వారి హక్కులు, ఉద్యోగ భద్రత, వేతనాలు, పనివేళలు, అదనపు పని గంటలు తదితర అంశాలపై చర్చించారు.ప్రైవేట్ ఆస్పత్రుల్లో పనిచేసే నర్సులకు ఆరోగ్య బీమా లేకపోవడం సరైన విధానం కాదని కవిత అన్నారు. నర్సులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా రోగులకు సేవలందిస్తున్నారని, అలాంటి సిబ్బందికి కనీస వైద్య భద్రత కల్పించాల్సిన బాధ్యత ఆస్పత్రి యాజమాన్యాలపై ఉందన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలతో ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి నర్సులకు ఆరోగ్య బీమా అందేలా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. నర్సుల హక్కుల పరిరక్షణతో పాటు ఉద్యోగ భద్రత, న్యాయమైన వేతనాలు, పనివేళలు, అదనపు పని గంటలకు సంబంధించిన నిబంధనలు అమలయ్యేలా ప్రభుత్వం పర్యవేక్షించాలని సూచించారు.

స్థానిక ఉద్యోగులకు అన్యాయం చేయొద్దు

తెలంగాణకు చెందిన ఉద్యోగులను పనివేళలు, జీతాలు, అదనపు పని గంటల విషయంలో ఇబ్బందులకు గురిచేస్తూ, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వారికి ప్రాధాన్యం ఇస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయని కవిత అన్నారు. ఇలాంటి పరిస్థితులను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి ప్రైవేట్ ఆస్పత్రులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు.

నర్సులు, ప్రైవేట్ ఆస్పత్రుల సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని ఆమె కోరారు. ఉద్యోగుల హక్కులను కాపాడే విషయంలో తెలంగాణ రక్షణ సేన వారికి అండగా ఉంటుందని కవిత హామీ ఇచ్చారు.

---

# 10 Lakh Crore Loans Written Off for Big Borrowers, But Poor Customers Are Penalised for Minimum Balance

Dr. Ramakrishna Perumandla
Telangana congress



**New Delhi, August 11:** Senior Congress leader and Chairman of Ramakrishna Charitable Trust, Dr. Ramakrishna Perumandla, strongly questioned the Union Government over the contrasting treatment of big corporate borrowers and ordinary bank customers.According to information placed before Parliament, banks have written off nearly ?9.95 lakh crore in loans given to large corporates and the services sector over the last 12 financial years. At the same time, banks collected thousands of crores from ordinary customers as penalties for failing to maintain minimum account balances. (ETBFSI.com)Dr. Ramakrishna said that the government must explain why financially powerful borrowers are given relief through massive loan write-offs, while poor and middle-class families are penalised when they are unable to maintain a prescribed minimum balance in their savings accounts."The common man deposits his hard-earned money in banks, yet when his account balance falls below the prescribed limit, the bank immediately deducts charges. On the other hand, thousands of crores of loans belonging to large borrowers are written off. This is not social justice."He said that banks should not treat the poor, daily-wage workers, farmers, small employees and middle-class families as a source of revenue through penalties and service charges.He further pointed out that the government has a responsibility to ensure that banking services remain accessible and affordable to ordinary citizens. The Reserve Bank of India already has regulations governing minimum-balance charges, while Basic Savings Bank Deposit Accounts provide a zero-minimum-balance option. (Reserve Bank of India)Dr. Ramakrishna Perumandla demanded that the Central Government immediately direct banks to stop penalising ordinary savings-account holders for non-maintenance of minimum balance, particularly those from economically weaker sections.He also demanded greater transparency regarding loan write-offs and asked the government to publish clear details of the beneficiaries, recovery amounts and action taken against large wilful defaulters."The government must protect the small depositor before protecting the interests of big borrowers. Banks should stand with the common people, not burden them further. We demand an immediate review and abolition of minimum-balance penalties for ordinary customers across the country," Dr. Ramakrishna said.






# డేర్ డెవిల్ మూవీ

## సౌత్ టాప్ హీరోస్ ఎంట్రీ

ఒకే ఫ్రేమ్ లో అజిత్, వెంకీ, మోహన్ లాల్

కోలీవుడ్ స్టార్ హీరో అజిత్ కుమార్ తన 64వ చిత్రంగా డేర్‌డెవిల్ తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. గతేడాది 'గుడ్ బ్యాడ్ అగ్లీ'తో బ్లాక్ బస్టర్ హిట్ ఇచ్చిన దర్శకుడు ఆధిక రవిచంద్రన్‌కు మరోసారి అవకాశం ఇచ్చాడు అజిత్. తమిళ సినీ వర్గాల నుండి అందుతున్న సమాచారం ప్రకారం ఈ సినిమాలో పలు భాషల సూపర్ స్టార్లను భాగం చేసేందుకు చర్చలు జరుగుతున్నాయి. మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్, టాలీవుడ్ విక్టరీ వెంకటేష్ కీలక పాత్రల్లో నటించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ముగ్గురు దిగ్గజ నటులు ఒకే స్క్రీన్‌పై కనిపిస్తే సినిమా స్థాయి మరింత పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. పాన్ ఇండియా భాషల్లో తెరకెక్కుతున్న ఈ సినిమాను అజిత్ కుమార్ భార్య షాలిని అజిత్ కుమార్ తన కొత్త నిర్మాణ సంస్థ 'బ్రేవ్ హార్ట్స్ ప్రొడక్షన్' బ్యానర్‌పై భారీ బడ్జెట్ పై నిర్మిస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తుండగా అభినందన్ రామానుజమ్ సినిమాటోగ్రఫీ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు.




# టబు మాస్ అవతార్

- 'స్లమ్ డాగ్'లో పూరి మార్క్ క్యారెక్టర్
- ఇన్‌కమ్ ట్యాక్స్ ఆఫీసర్‌గా పవర్‌ఫుల్ రోల్..
- సిగరెట్, మాస్ స్వాగ్, యాక్షన్.. టబును ఇలా ఎప్పుడూ చూడలేదు!
- విజయ్ సేతుపతితో ఢీ అంటే ఢీ..
- స్క్రీన్‌పై మరో లెవల్ వార్!

దర్శకుడు పూరి జగన్నాథ్ తన సినిమాల్లో క్యారెక్టర్లను బోల్డ్‌గా, రొటీన్‌కు భిన్నంగా డిజైన్ చేయడంలో తనదైన శైలిని చూపిస్తుంటారు. అయితే ఈసారి ఓ సీనియర్ నటికి ఆయన రాసిన క్యారెక్టర్ మరింత స్పెషల్‌గా కనిపిస్తోంది. విజయ్ సేతుపతి హీరోగా నటిస్తున్న పాన్ ఇండియా ప్రాజెక్ట్ 'స్లమ్ డాగ్' లో టబు ఓ పవర్‌ఫుల్ అవతార్‌లో కనిపించబోతున్నారు. ఈ చిత్రంలో గౌరీ హెగ్డే అనే ఇన్‌కమ్ ట్యాక్స్ డిప్యూటీ కమిషనర్ పాత్రలో టబు నటిస్తున్నారు. తాజాగా విడుదలైన గ్లింప్స్ చూస్తే.. ఈ పాత్ర కేవలం ఓ ప్రభుత్వ అధికారిణిగా మాత్రమే పరిమితం కాదని స్పష్టమవుతోంది.

**టబు అంటే ఇదేనా**

'అలా వైకుంఠపురములో' సినిమాలో తల్లి పాత్రలో కనిపించిన తర్వాత టబు తెలుగులో పెద్దగా కనిపించలేదు. సాధారణంగా కూల్, క్లాసీ, గంభీరమైన పాత్రలకు పేరున్న ఆమెను ఇప్పుడు పూర్తిగా భిన్నమైన మాస్ అవతార్‌లో చూపించడం ఆసక్తికరంగా మారింది. బస్తీలోకి ఎంట్రీ ఇచ్చి సిగరెట్ వెలిగిస్తూ కనిపించే టబు.. గూండాలతో నేరుగా తలపడే సన్నివేశాల్లో అదరగొట్టారు. "ఏయ్.. మా బస్తీలోకి ఎందుకొచ్చావు?" అని ఓ వ్యక్తి ప్రశ్నించగా.. తనదైన స్టైల్‌లో సమాధానం చెబుతూ గూండాలను చితక్కొట్టే సన్నివేశం పాత్రను ఎంత బోల్డ్‌గా డిజైన్ చేశారో చెబుతోంది. ఇక ఐటీ రైడ్స్, అధికారిక వ్యవహారాలకే పరిమితం కాకుండా.. అవసరమైతే చేతిలో కర్ర పట్టుకుని రంగంలోకి దిగే అధికారిణిగా టబును చూపించారు.



# కావ్య థాపర్ మేకోవర్ మాయ..

కొత్త లుక్‌తో కుర్రకారుకు కిర్రెక్కిస్తోంది!
సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన పిక్స్

తెలుగు చిత్రసీమలో తన అందం, అభినయంతో ఆకట్టుకున్న కథానాయిక కావ్య థాపర్ మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారారు. తాజాగా ఆమె షేర్ చేసిన ఫోటోషూట్ పిక్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. కెరీర్ ప్రారంభంతో పోలిస్తే ఇప్పుడు మరింత ఫిట్‌గా, స్టైలిష్‌గా కనిపిస్తున్న కావ్య కొత్త మేకోవర్ చూసి అభిమానులు ఆశ్చర్యపోతున్నారు. తాజా ఫోటోషూట్‌లో కావ్య థాపర్ విభిన్న స్టైలిష్ లుక్స్‌లో కనిపించారు. ప్రింటెడ్ బ్లూ మ్యాక్సీ డ్రెస్‌లో ఒక లుక్‌లో మెరిసిన ఆమె.. మరో ఫోటోలో ఫ్లోరల్ క్రాప్ టాప్, హై-స్లిట్ స్కర్ట్‌తో ఆకట్టుకున్నారు. గోల్డ్ బ్యాంగిల్స్, హై హీల్స్‌తో చేసిన ఫ్యాషన్ స్టైలింగ్ ఆమె లుక్‌కు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చింది. కెమెరా ముందు ఎంతో కాన్ఫిడెంట్‌గా ఇచ్చిన పోజులు నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. కొత్త లుక్‌లో కావ్య మరింత ఉత్సాహంగా, స్టైలిష్‌గా కనిపిస్తున్నారంటూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు.

**కెరీర్‌కు కొత్త ఊపు**

కెరీర్ ప్రారంభంలోనే తనకంటూ గుర్తింపు తెచ్చుకున్న కావ్య.. తెలుగు సినిమాలతో పాటు ఇతర భాషల్లోనూ అవకాశాలు అందుకున్నారు. అయితే ఇటీవల కొంతకాలంగా సినిమాల సంఖ్య తగ్గడంతో.. ఫిట్‌నెస్‌పై ప్రత్యేక దృష్టి పెట్టి తన లుక్‌లో మార్పులు తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. ఈ మేకోవర్‌తో కావ్య మళ్లీ వరుస ప్రాజెక్టులతో బిజీ అవుతారనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా ఆమె నటిస్తున్న 'నేను రెడీ' సినిమా కెరీర్‌కు మంచి మైలేజ్ ఇస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు. గ్లామర్ ఫీల్డ్‌లో ఫిట్ నెస్, స్టైలింగ్‌కు ఉన్న ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని కావ్య చేసిన ఈ మేకోవర్ ఇప్పుడు నెటిజన్లలో చర్చనీయాంశంగా మారింది. నటనతో పాటు గ్లామర్, ఫిట్‌నెస్‌తోనూ తనదైన ముద్ర వేస్తున్న కావ్య థాపర్.. కొత్త లుక్‌తో మరోసారి దర్శకులు, అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నారు. ఆమె తాజా ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి.



# ఆండ్రియా జెర్మియా స్టైలిష్ ట్రీట్..

వైరల్‌గా మారిన లేటెస్ట్ ఫొటోలు!

విలక్షణమైన పాత్రలు, అద్భుతమైన గానంతో దక్షిణాది ప్రేక్షకుల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి, గాయని ఆండ్రియా జెర్మియా మరోసారి సోషల్ మీడియాలో సందడి చేస్తున్నారు. ఆమె తాజాగా చేసిన ఫోటోషూట్‌కు సంబంధించిన చిత్రాలు నెట్టింట వైరల్‌గా మారాయి. తాజా ఫోటోషూట్‌లో ఆండ్రియా బ్లాక్ స్ట్రాప్‌లెస్ ట్యూబ్ టాప్, లైట్‌వాష్ డెనిమ్ షార్ట్స్‌లో కనిపించారు. సింపుల్ సమ్మర్ లుక్‌లో ఎంతో కాన్ఫిడెంట్‌గా కనిపించిన ఆమె స్టైల్ నెటిజన్లను ఆకట్టుకుంటోంది. హై పోనీటైల్, గోల్డ్ హూప్ ఇయర్‌రింగ్స్, మెడలో సింపుల్ చోకర్‌తో ఆమె లుక్‌కు మరింత క్లాసీ టచ్ ఇచ్చారు. తలుపు ఫ్రేమ్‌ను ఆనుకుని ఆమె ఇచ్చిన క్యాజువల్ పోజులు ఫోటోషూట్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నేచురల్ ఎక్స్‌ప్రెషన్స్, ఫిట్‌నెస్ లుక్‌తో ఆండ్రియా మరోసారి తనదైన స్టైల్‌తో అభిమానులను ఆకట్టుకున్నారు.

**చేతినిండా సినిమాలు**

నటనతో పాటు గాయనిగానూ బిజీగా ఉన్న ఆండ్రియా ప్రస్తుతం పలు ఆసక్తికరమైన ప్రాజెక్టుల్లో నటిస్తున్నారు. 'కా ది ఫారెస్ట్', 'లీడర్', 'పిశాచి 2' తో పాటు ధనుష్ నటించిన 'వడ చెన్నై'కి సీక్వెల్‌గా తెరకెక్కుతున్న 'అరసన్' లోనూ కీలకపాత్రలో కనిపించనున్నారు. సినిమాలతో పాటు సోషల్ మీడియా పోస్టులు, ఫోటోషూట్లతోనూ నిత్యం అభిమానులను అలరిస్తున్న ఆండ్రియా.. తాజా ఫోటోలతో మరోసారి నెట్టింట ట్రెండింగ్‌లోకి వచ్చారు. నటన.. సంగీతం.. స్టైల్.. ఇలా అన్ని రంగాల్లోనూ తనదైన ముద్ర వేస్తున్న ఆండ్రియా జెర్మియాకు రాబోయే సినిమాలు మరింత మంచి విజయాలు అందించాలని అభిమానులు కోరుకుంటున్నారు.

# కొత్త కథలకు నాగార్జున గ్రీన్ సిగ్నల్

- అన్నపూర్ణ స్టూడియోస్ తలుపులు ఓపెన్!
- కొత్తవారితో సినిమాలు తీస్తాం
- స్టూడియో అంటే అద్దెకిచ్చి డబ్బులు సంపాదించడం మాత్రమే కాదు
- ప్రతిభావంతులకు కింగ్ నాగార్జున ఓపెన్ ఆఫర్



మంచి కథలతో వచ్చే కొత్తవారికి అవకాశాలు కల్పించి సినిమాలు నిర్మించేందుకు తమ అన్నపూర్ణ స్టూడియోస్ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని టాలీవుడ్ 'కింగ్' అక్కినేని నాగార్జున ప్రకటించారు. కొత్త దర్శకులు, ప్రతిభావంతులను ప్రోత్సహించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. 'పళ్ళ బురుసు' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన నాగార్జున మాట్లాడుతూ.. మంచి కథ ఉన్నవారు ఎవరైనా నేరుగా అన్నపూర్ణ స్టూడియోస్‌ను సంప్రదించవచ్చని పిలుపునిచ్చారు. స్టూడియోను కేవలం లీజుకు ఇచ్చి ఆదాయం సంపాదించడమే తమ ఉద్దేశం కాదని.. సినీ రంగానికి తిరిగి సేవ చేయాలనే ఆలోచనతో కొత్త దర్శకులతో సినిమాలు నిర్మిస్తున్నామని చెప్పారు. ఇటీవల కొత్త దర్శకులతో నిర్మించిన 'లెనిన్' మంచి విజయాన్ని అందుకుందని నాగార్జున గుర్తుచేశారు. ఇప్పుడు 'పళ్ళ బురుసు' చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో 'రంభ, ఊర్వశి, మేనక' చిత్రాలతో పాటు తన ప్రతిష్ఠాత్మక 100వ చిత్రం 'కింగ్ 100' కూడా అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై తెరకెక్కనున్నట్లు వెల్లడించారు.

**ఈ నెల 14న 'పళ్ళ బురుసు'**

గోమతి రెడ్డి, సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్, ప్రజ్వల్ యాద్మా ప్రధాన పాత్రల్లో నటించిన 'పళ్ళ బురుసు' చిత్రానికి ఉదయ్ చౌహాన్ దర్శకత్వం వహించారు. అన్నపూర్ణ స్టూడియోస్, ఎపిక్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. కొత్త కథలకు, కొత్త ప్రతిభకు అన్నపూర్ణ స్టూడియోస్ అండగా నిలుస్తుందని నాగార్జున చేసిన ప్రకటన.. టాలీవుడ్‌లో అవకాశాల కోసం ఎదురుచూస్తున్న యువ దర్శకులు, రచయితలకు మరింత ఉత్సాహాన్ని ఇచ్చేలా ఉంది.